ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 25 అక్టోబరు 2025



స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు




తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.వాణిశ్రీ తనిఖీ చేశారు. డా. ప్రసాద్ మెమోరియల్ లీలావతి నర్సింగ్ హోమ్, శ్రీదేవి హాస్పిటల్, రమ హాస్పిటల్‌లలో రికార్డ్స్, ఫారం ఎఫ్ నమోదును పరిశీలించారు. స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ చేయమనే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేస్తే చట్ట ప్రకారం నేరమన్నారు. నిర్ధారణ చేసిన వారికి, అడిగిన వారికి చట్ట ప్రకారం 3 సంవత్సరాలు జైలు శిక్ష 10 వేల రూపాయలు జరిమానా విధిస్తామన్నారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని, సంతానం లేని వారి సంఖ్య ఒక వైపు పెరుగుతుంటే, ఆడ పిల్లలు వద్దను కోవడం నేరమని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ చేసినట్టు రుజువు అయితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డా. లక్ష్మీ భవానీ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు

- ఆకాశం మేఘావృతం కావడంతో రైతుల ఆందోళన
- అక్కడక్కడా కురుస్తున్న చిరు జల్లులు
- కోతకు, కాతకు వచ్చిన వరి, పత్తి పంట
- తగ్గని తేమ శాతం, దక్కని మద్దతు ధరలు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వరి, పత్తి పంట కోతకు, కాతకు వచ్చిన వేళలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా జిల్లాలో ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తుండడంతో పంట చేతికి వస్తుందా, లేదా అని రైతులు దిగులు పడు తున్నారు. చిరుజల్లుల వల్ల పంటలో తేమ శాతం తగ్గక పోవడంతో మద్దతు ధరలు దక్కకుండా పోతున్నాయి. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 2,62,831 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరి పంట 2,10,046 ఎకరాల్లో సాగు చేయగా, పత్తి పంట 49,783 ఎకరాల్లో వేశారు. మొక్కజొన్న 705 ఎకరాలు, 2,301 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు.

● ప్రారంభమైన కోతలు

జిల్లాలో పది రోజుల క్రితం నుంచే వరి కోతలు ఆరంభించారు. వ్యవసాయ బావుల కింద రోహిణి కార్తెలో వేసిన వరి పంట కోతకు వచ్చింది. కోతకు వచ్చిన వరి పంటను కోసి రైతులు ఆరబెట్టారు. అలాగే మొదటి దశ పత్తి పంట కూడా కాతకు వచ్చింది. రైతులు పత్తిని ఏరుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సాధారణ స్థాయిలోనే వర్షాలు కురిశాయి. ఇప్పటి వరకు 935.7 మిల్లీ మీటర్లకు గాను 900.7 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ముత్తారం మండలంలో సాధారణస్థాయి కంటే ఎక్కువగా, రామగుండం మండలంలో సాధారణ స్థాయిలో కూడా వర్షాలు పడలేదు. మరో నాలుగు రోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరిస్తుండడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల నుంచి ఆకాశం మబ్బులు కమ్ముకుని ఉంటున్నాయి. అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. ఎప్పుడు భారీ వర్షాలు పడతాయోనని కలవర పడుతున్నారు.

● పత్తి రైతుకు దక్కని మద్దతు ధర

పత్తి రైతులు కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. కాతకు వచ్చిన పత్తిని వేగంగా తెంపకపోతే వర్షాలకు పత్తి తడిసి నల్ల బడే ప్రమాదం ఉంది. ఇప్పటికే పత్తిలో తేమ శాతం 8 కంటే ఎక్కువగానే ఉంటుండడంతో వ్యాపారులు మద్దతు ధరలు

(మిగతా 8వ పేజీలో)

గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య

పెద్దపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తూ పన్నులు కూడా వసూళ్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పన్నుల వసూళ్లు, పారిశుధ్య నిర్వహణ, విజిబుల్ క్లీనింగ్, సెగ్రిగేషన్ల నిర్వహణ, దోమల నివారణకు ఫాగింగ్, సిటిజెన్ సర్వీసెస్ నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల క్లియరెన్స్, తాగునీటి సరఫరా అంశాలపై చర్చించారు. అనంతరం డీపీవో మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు చెత్తను సేకరించాలని, డంపింగ్ యార్డుల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరాలో తలెత్తే ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించాలన్నారు. లక్ష్యాల మేరకు పన్నుల వసూళ్లు చేపట్టాలన్నారు. జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి రాజేశ్వర్, మిషన్ భగీరథ ఈఈ శ్రీనివాస్, పెద్దపల్లి, మంథని డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మిక వర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం గోదావరిఖనిలో జిల్లా అధ్యక్షుడు ఈ నరేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్, గ్రామపంచాయతీ, మున్సిపల్, ప్రభుత్వ హాస్పిటల్ ఇతర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు స్కీమ్ వర్కర్స్ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల సందర్భంలో సీఎం రేవంత్‌రెడ్డి కార్మికవర్గానికి అనేక హామీలను ఇచ్చారని, కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానని, పని గంటల పరిరక్షణ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, జిల్లా నాయకులు బి బుచ్చమ్మ, ఐ రాజేశం, జీ మల్లేశం, ఎడ్ల రవికుమార్, ఎస్ ప్రసాద్, బండ పద్మ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించడంలో నిర్లక్ష్యం..

- పన్నుల వసూళ్లలో రాఘవపూర్ వెనుకంజ..
- కేవలం 18 శాతం మాత్రమే వసూలు
- మండలంలో నామమాత్రంగా ఇంటి పన్నుల సేకరణ

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇంటి పన్నుల వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మండలంలో నామమాత్రంగా ఇంటి పన్ను వసూలు చేయడంతో లక్ష్యాన్ని చేరుకోవడంలో రాఘవపూర్ వెనుకంజలో పడింది. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం క్షేత్రస్థాయిలో ఆచరణ సాధ్యం కాకపోవడంతో నీరుగారి పోయే పరిస్థితి ఏర్పడింది. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకుగాను 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం కోటి 6 వేల 559 ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు వసూలు చేయాల్సిన ఇంటి పన్నులు అధికారుల అలసత్వంతో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా కేవలం 18 శాతం మాత్రమే ఇంటి పన్నులు వసూలు చేశారు. ఇందులో ప్రధానంగా పెద్ద గ్రామ పంచాయతీ అయిన రాఘవపూర్ వెనుకబడి ఉండటం గమనార్హం.

● గ్రామాల వారీగా ఇంటి పన్నులు

మండలంలోని 30 గ్రామ పంచాయతీలు ఉండగా



రాఘవపూర్‌లో నోటీస్ అంటిస్తున్న బిల్ కలెక్టర్ (ఫైల్)

పన్నులు చెల్లించని వారికి అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. కాని పన్నులు వసూలు చేయడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీ అయి ఉన్నా పన్నులు వసూలు చేసేందుకు అధికారులు ఆసక్తి చూపని పరిస్థితి ఉంది. మండలంలోని కోటికి పైగా పన్నులు చేయాల్సి ఉంది. మొత్తం కలిపి మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉన్న అధికారుల నిర్లక్ష్యంతో 18 శాతం వరకే పూర్తయింది.

● నోటీసులు ఇవ్వడంతోనే సరి ...

రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి 29 గ్రామాలు ఉండగా రాఘవపూర్ మాత్రం అధికారుల అలసత్వం వలన ఇప్పటివరకు కేవలం ఒక్క శాతం మాత్రమే వసూలు చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ అధికారుల ఆదేశాలు పాటిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు గ్రామ పంచాయతీకి రావాల్సిన ఆదాయం మాత్రం సమకూర్చలేక పోతున్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం

- ఎంపీడీవో
కొప్పుల శ్రీనివాస్, పెద్దపల్లి



మండలంలోని 30 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇంటి పన్నుల వసూలు ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతి గ్రామ పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూలు అయ్యేలా చర్యలు చేపడుతాం.

గ్రామం	మొత్తం	వసూలు
అందుగులపల్లి	2,73,539	39,468
అప్పన్నపేట	11,33,764	54,162
భోజన్నపేట	2,14,915	66,907
బొంపల్లి	4,66,490	7,8296
బ్రాహ్మణపల్లి	3,78,059	17,870
చీకురాయి	2,83,790	5,282
దేవునిపల్లి	73,125	19,189
గోపయ్యపల్లి	66,023	23,204
గౌరెడ్డిపేట	3,24,443	88,336
గుర్రాంపల్లి	1,73,903	7561
హన్మంతునిపేట	3,40,776	1,43,036
కనగర్తి	1,47,460	17,897
కాపులపల్లి	1,05,794	59,792
కాసులపల్లి	1,88,176	39618
కొత్తపల్లి	3,58,848	26,368
కుర్మపల్లి	1,37,569	28,597
మారేడుగొండ	2,03,757	3,136
మూలసాల	1,88,560	28,812
ముత్తారం	1,74,601	67,095
నిమ్మనపల్లి	2,34,185	78,564
నిట్టూరు	2,76,767	42,947
పాలితం	1,51,691	40,562
పెద్దబొంకూర్	4,19,449	10,678
పెద్దకల్వల	4,92,091	1,84,686
రాఘవపూర్	19,01,658	26,935
రాగినేడు	2,75,583	1,07,775
రాంపల్లి	70,572	50,239
రంగాపూర్	4,45,754	61,197
సబ్బితం	1,73,183	1,06,309
తుర్కలమద్దికుంట	3,32,034	1,62,984

అంతర్గాం మద్యం షాపునకు 45 దరఖాస్తులు

రామగుండం రెండు షాపులకు హైదరాబాద్ వ్యాపారుల దరఖాస్తు

8


రామగుండంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలత



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రామగుండంలో పరిశ్రమల స్థాపన, నిధుల మంజూరుపై చర్చించానన్నారు. జెన్‌కో బోర్డు ప్లాంట్ నిర్మాణానికి ఆమోదం తెలుపడం శుభపరిణామమన్నారు. రామగుండం నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులకు రూ.40కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. పాలకుర్తి లిఫ్ట్‌పై డిప్యూటీ సీఎంతో చర్చించానన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. పెద్దాపూర్ అనుబంధ గ్రామమైన కుర్మపల్లికి మెయిన్ రోడ్డు నుంచి గ్రామం వరకు కోటి రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిందన్నారు. ఎంపీడీవో పద్మజ, పార్టీ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, మార్కెట్ వైస్ చైర్మన్ కొమ్ము పోచాలు, నాయకులు లింగయ్యగౌడ్, జలపతిరెడ్డి, పల్లాటి రవి, పెసరు లచ్చయ్య, రాగల్ల రవి, గడ్డం క్రిష్టారెడ్డి, కనుకయ్య, గోపాలక్రిష్ణ, శంకర్, బండి స్వామి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు

ధర్మారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు బాధ్యత తీసుకొని ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని నాయకులు, అధికారులు, రైతులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కలెక్టర్‌తోపాటు సివిల్ సప్లయ్ అధికారులు కొనుగోలు కేంద్రాలను నిత్యం పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు సమయంలో మిల్లర్లతో మాట్లాడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుందని గుర్తుచేశారు. ప్రతి సెంటర్‌లో సన్న ధాన్యం కొనుగోలు జరగుతుందని, ప్రతీ రైతుకు సన్న వడ్ల బోనస్ అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని భరోసా ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, పత్తిపాక సింగల్ విండో చైర్మన్, నేముల వెంకటేరెడ్డి, డైరెక్టర్లు గంధం మహిపాల్, బద్దం గంగారెడ్డి, కోల శ్రీనివాస్, సింగిల్ విండో డైరెక్టర్లు బద్దం రవీందర్ రెడ్డి, కొండ సులోచన, సీఈఓ బుచ్చయ్య, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి

ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యానికి మంచిదే కాని హానీ ఉండదన్నారు. నెలలో ఒక్కసారైన రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసిన వారమవుతామన్నారు. అలాగే చెడు అలవాట్లకు గురి కాకుండా ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మొత్తం 140 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాలకుర్తి మండల యువత పాల్గొని రక్తదానం చేశారు. బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్ పిలుపు మేరకు పలు గ్రామాల యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.



రక్త దాన శిబిరంలో డీసీపీ కరుణాకర్



రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తెపీరీల దర్గా సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూల మలుపు వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కూలీ శివ రాత్రి శ్రీనివాస్(34) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలోని శివ రాత్రి శ్రీనివాస్ దినసరి కూలీ పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై రాచర్లగొల్లపల్లి వైపు వస్తున్న క్రమంలో సత్తెపీరీల దర్గా మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలపాలైన అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాస్ చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి తల్లి నర్సవ్వ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, అరవింద్ ఉన్నారు. మృతుడి సోదరుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


బుగ్గయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికిచెందిన మానుక బుగ్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్య కారణలతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి


శంకర్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన దమ్మని శంకరయ్య(39) స్థానిక ఫ్రియామిల్క్‌లో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన శంకర్‌ను నాగు పాము కాటువేసింది. కుటుంబసభ్యులు వెంటనే 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. శంకర్‌కు ఏం కరిచిందో ఇంట్లో వేతికితే నాగుపాము కనిపించింది. దాన్ని స్థానికులు చంపేశారు. మృతుడు శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉన్న శంకర్ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయాలు నెలకొన్నాయి.

రూపునారాయణపేటలో డిగ్రీ విద్యార్థిని..


అక్షిత(ఫైల్)

ఓదెల: ఓదెల మండలంలోని రూపునారాయణపేటకు చెందిన అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. సుల్తానాబాద్ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత బతుకమ్మ పండుగకు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం కాలుపై పాము కాటువేయడంతో గ్రామస్థుడి సలహాతో పాము కాటుకు మంత్రం వేయించేందుకు మరో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్షిత ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో 108అంబులెన్స్‌లో సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

- ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాలరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దెబ్బతిని ఏళ్ల గడుస్తున్నా, తారు లేచిపోతున్నా నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. గుంతల రహదారులపై ఇబ్బం దుల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రహదారుల మరమ్మతు, నిర్వహణ నుపట్టించుకోలేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దెబ్బతిన్న రహదారులు...

జగిత్యాల జిల్లా కేంద్రానికి అతిసమీపంలో ఉన్న తిమ్మాపూర్-పొలాసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పది సంవత్సరాల కిందట నిర్మించిన ఈ రహదారి గోతులు, మట్టి నీటితో నిండిపోయి వాహనదారులకు నరకయాతనగా మారింది. వర్షం పడితే చెరువులా మారుతోంది. కాకతీయ కెనాల్ నీరు నిత్యం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పలుచోట్ల తారులేచిపోయి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందనలేకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల మండలం మోతె, జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, నర్సింగాపూర్, వంజరిపల్లె, హన్మాజీపేట, తిప్పన్నపేట మీదుగా బాలపల్లికి వెళ్లే అంతర్గత రోడ్లు తారులేచిపోయి అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. రైతులు వేకువ జామున జగిత్యాలలోని మార్కెట్‌కు వెళ్లే క్రమంలో రోడ్లపై గోతులు కనబడకపోవడంతో ప్రమాదాలకు బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


తారులేచి అధ్వానంగా మారిన వెల్దుర్తి రహదారి

మరమ్మతులకు నోచుకోని రహదారులు

మల్యాల: మండలంలో అనేక గ్రామాల్లో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారులు ఇటీవల ఈ వానాకాలంలో వర్షాలకు మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో కోతలకు గురి కాగా కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. రామన్నపేట నుంచి గొర్రెగుండం వెళ్లేదారి తారులేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. రాంపూర్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారికిరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం పనులు నిలిచి కంకర తేలింది. రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మల్యాల నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్, గుడిపేట వెళ్లేదారులు అధ్వనంగా మారడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారుల పరిస్థితి ఇలాగే ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా గొర్రెగుండం వెళ్లే దారి

ప్రమాదాల బారినపడుతున్నారు..

- కొడిపల్లి నాగార్జున్, తిమ్మాపూర్



నిత్యం రద్దీగా ఉండే గ్రామాల అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించడానికి నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల నిర్మాణాలు చేపట్టాలి.

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీ..

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో తాళంవేసి ఉన్న ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెనపల్లి గ్రామంలో బొరగల్ల నర్సవ్వ, బొరగల్ల రాజయ్య, బొల్లి నరేష్ అనేవ్యక్తులు తమ ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లగా గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇండ్లలోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరాలు కోరగా, పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

బంగారు చైన్ అపహరణ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద భాగ్య అనే మహిళ పర్స్‌లో నుంచి అర తులం బంగారు చైన్ అపహరించిన సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో ఆమె చుట్టు పక్కనే ఉన్న భక్తుల సహాయంతో చైన్ అపహరించిన మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన భాగ్య అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి గోదావరి నది స్నానం కోసం వచ్చింది. స్నానం చేసే సమయంలో స్నానఘట్టాల వద్ద బ్యాగులు, పర్స్ ఉంచి నదిలోకి వెళ్లింది. ఆ సమయంలో భిక్షాటన చేస్తున్న ఒక మహిళ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. సదరు మహిళనే పర్స్‌లో నుంచి బంగారు చైన్ అపహరించిందని పోలీసులకు అప్పగించింది. బాధితురాలు భాగ్య బంగారు చైన్ చోరీ గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంగారు చైన్ చోరీ గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

హత్యానేరంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి జీవితఖైదు

- ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా
- కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు తీర్పు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూతురు ప్రేమించి కులాంతర వివాహం చేసుకుందనే కక్ష పెంచుకున్న ఆమె కుటుంబసభ్యులు చివరకు ఆమె భర్త ఆవునూరు శ్రీనివాస్(31)ని రాళ్లతో కొట్టి హత్యచేశారు. ఈకేసులో నిందితులు నలుగురికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జే కవిత శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మండల గౌతమి అదే గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీనివాస్‌లు ప్రేమించుకున్నారు.

కొంతకాలం వేరే గ్రామంలో నివాసం ఉండి తిరిగి బ్రాహ్మణపల్లికి వచ్చి అక్కడే నివాసం ఉన్నారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. గౌతమి ఇతర కులానికి చెందిన శ్రీనివాస్‌ను వివాహం చేసుకోవటం తండ్రి మండల ఓదెలుకు ఇష్టం లేదు. దీంతో శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్న గౌతమి తండ్రి ఓదెలు(48), సోదరులు మండల సంపత్(28), మండల దేవేందర్(25), తల్లి మండల లక్ష్మి(45)లు గతంలో ఒకసారి దాడి చేయగా గౌతమి తండ్రి, సోదరుడిపై కేసులు నమోద య్యాయి. 2019జూన్ 19న రాత్రి ఆవునూరి శ్రీనివాస్ మద్యం సేవించి తన బైక్‌పై ఇంటికి వస్తూ మార్గ మధ్యలో గౌతమి తండ్రి ఇంటివద్ద బైక్ నిలిపి ఫోన్‌లో గౌతమితో మాట్లాడుతుండగా గౌతమి కుటుంబసభ్యులు నలుగురు శ్రీనివాస్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ రాళ్లదాడిలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు.

ఈ ఘటనపై వీణవంక పోలీసులు గౌతమి కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేయగా జమ్మికుంట రూరల్ సీఐ ఏ రాములు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గౌతమి తండ్రి ఓదెలు, సోదరులు సంపత్, దేవేందర్, తల్లి లక్ష్మిలకు జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సైదాపూర్‌లో ఎలుగుబంటి సంచారం

- ఆందోళన చెందుతున్న ప్రజలు

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సమ్మక్కగుట్ట వద్ద పెట్రోల్‌బంక్ ముందు నుంచి గురువారం రాత్రి ఎలుగుబంటి సంచరిస్తూ రోడ్డుపైవెళ్తున్న దృశ్యాలు పెట్రోల్ బంక్ సీసీకెమెరాలో రికార్డు అయ్యాయి. ఆ దృశ్యాలు బయటకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు రాత్రి బావుల కాడికి కరెంటు పెట్టేందుకు వెళ్తారని, ఎలుగు బంటి సంచారంతో ఇబ్బందులు ఉంటాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు ఎలుగుబంటిని బంధించి తీసుకుపోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


సమ్మక్క గుట్ట వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

మహిళలకు బ్యూటీషియన్ కమర్షియల్ కోర్సుల శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీకాలనీలోగల దుర్గాబాయి మహిళాశిశువికాస కేంద్రంలో జిల్లా మహిళానైపుణ్యాభివృద్ధి శిక్షణాసంస్థ కమర్షియల్ పద్ధతిలో 45రోజుల పాటు 15నుంచి 50సంవత్సరాలలోపు మహిళలకు వారి అనుకూల సమయాల్లో బ్యూటీషియన్‌కోర్సుపై శిక్షణను అందించనున్నట్లు కేంద్రం జిల్లామేనేజరు సుధారాణి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్‌లో వివిధరకాల కోర్సులనుబట్టి ఫీజు ఉంటుందని, ఆసక్తి గల మహిళలు ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్13లోపు ఎల్ఎండీకాలనీలోని తమకార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మందిపై కేసు
- రూ 33,200 నగదు స్వాధీనం

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఒక గొర్రెల ఫామ్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిదిమంది వ్యక్తులను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.33,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం నుంచి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే అందిన పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. జూదం ఆడితే కేసులు నమోదుచేసి చట్టరిత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

మంథనిలోని గంగాపురి శివారులో..

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కొందరు మూడు పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా గంగాపురి గ్రామానికి చెందిన మేడిశెట్టి సతీష్, ఓగ్గం అజయ్, దూడపాక రాజశేఖర్, ఎరుకల శేఖర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.8150నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న దాడి ప్రణీత్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రణీత్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్ పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

విద్యార్థిని మృతదేహంతో ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకో

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీవర్ష(15) మృతదేహంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ రంగారావు గురుకుల పాఠ శాలలో హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని వి శ్రీవర్ష ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా శ్రీవర్ష రాంపూర్ గ్రామానికి రాగా, గురువారం కుటుంబ సభ్యులు శ్రీవర్షను హాస్టల్‌లో వదిలి వచ్చారు. ఈ క్రమంలో హాస్టల్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీవర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంగర ఎస్ఐ దివ్య హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారితో మాట్లాడారు. అనంతరం విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహాన్ని మోసుకుంటూ అంబేడ్కర్ చౌరస్తా వద్దకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ముందస్తుగా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ విద్యార్థిని మృతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


విద్యార్థిని శ్రీవర్ష మృతదేహంతో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు

కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

శ్రీవర్ష కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి కారకులైనా వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీవర్షది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అన్నారు. అనంతరం రాంపూర్ గ్రామానికి వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పత్తి కూలీలపై తేనెటీగల దాడి

- 17 మందికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది పత్తి కూలీలపై తేనెటీగలు ఒకేసారి దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన కనగర్తి, సుద్దాల గ్రామాల మధ్య జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది కూలీలు ఉదయం పత్తి చేనులో పని చేస్తుండగా, సమీపంలోని తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. దాడిలో పలువురు కూలీలు స్పృహ కోల్పోయారు. కూలీల ఆర్తనాదాలు విన్న స్థానికులు, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సహాయంతో గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారు లావణ్య, సుమలత, దేవేంద్ర, కర్ణ, మమత, లత, తేజ, శృతి, రజితతో పాటు మరో 8 మంది కూలీలు ఉన్నారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు మంతెన సంతోష్, కచ్చకాయల బాల్‌రెడ్డి, నాలుక సత్యం, ఎరవెల్లి విజయ్, మల్లారెడ్డి, సంజీవ్, రవి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, బొడ్డు రమేష్, సుంకరి రెడ్డి తదితరులు ఉన్నారు.


బాధితులను పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య

పొరండ్లలో జన్మించిన వింత గొర్రె పిల్ల

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్ల గ్రామంలోని తోడెంగ బాలయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రె శుక్రవారం వింత గొర్రెపిల్లను జన్మనిచ్చింది. గొర్రె పిల్లకు 3తలలు, 3కండ్లు, 8కాళ్లు ఉన్నాయి. అయితే గొర్రె ఈనే సరికే గొర్రెపిల్ల మృతిచెంది ఉంది.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులుచేసి శుక్రవారం పట్టుకున్నారు. ఇసుకను లోడ్‌చేసుకుని వెళ్తున్న సమయంలో గ్రామస్థులు కొందరు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో.. 20 సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిగ్రస్థురాలైన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాలికకు నాలుగు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సో కేసెస్) రత్నపద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికను నిందితుడు ఠాకూర్ అరవింద్ సింగ్ (22) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, ఎస్సై సురేందర్ రెడ్డి కేసు విచారణ జరిపి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ఆదారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

గంజాయి నిందితులకు.. ఏడు సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి యత్నించిన ఇద్దరు నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, 20వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2021 అక్టోబరు 25వతేదీన మండలంలోని వర్షకొండ సమీపంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిడ్డె వినోద్, జాదవ్ రంజిత్ గంజాయి కలిగి ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. అప్పటి ఎస్సై రాజాప్రమీల అక్కడ తనిఖీ నిర్వహించగా అనుమానితులవద్ద నుంచి 2,200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కారు, ఐదువేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి ప్రయత్నించినట్లు తేలింది. నిందితులను పోలీసులు పట్టుకుని సాక్ష్యాలు ప్రవేశపెట్టగా జడ్జి శిక్షను ఖరారు చేస్తు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

విప్‌పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌పై ఫేస్‌బుక్‌లో రుద్రంగికి చెందిన గంటె ప్రసాంత్‌యాదవ్ అనేవ్యక్తి అనుచిత పోస్టులు పెట్టాడని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎస్సై నవీన్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అవమానకర పోస్టులు పెట్టి విప్ ఆత్మగౌరవానికి భంగం కలిగించాడని అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కోరారు. ఈ సందర్భంగా లింగారావు, రంజిత్, రాములు ఉన్నారు.

నేలమట్టమైన రాజన్న లడ్డూ తయారీ కేంద్రం



లడ్డూ తయారీ కేంద్రం తొలగింపు అనంతరం రాజన్న ఆలయం వెనకభాగం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పురాతన లడ్డూల గోదాం నేలమట్టమైంది. ఆలయ ప్రాకారానికి ఆనుకుని ఉన్న లడ్డూ గోదాం కూల్చివేయడంతో బాలాత్రిపురసుందరీదేవి ఆలయంతో పాటు సోమేశ్వర ఆలయాలు బయటకు కనిపిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పనుల కూల్చివేతలు గురువారం రాత్రి ప్రాకారం గోడలోకి ప్రవేశించాయి. ప్రాకారం లోపల భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, ఆలయానికి దక్షిణవైపు ఉన్న కోటిలింగాల నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ల తొలగింపు పనులు చకచకా జరుగుతున్నాయి.

16మంది పిల్లలకు ఓపెన్ హార్ట్ సర్జరీ

సుభాష్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం 15మంది చిన్నపిల్లలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఇమ్యూనైజన్ (డీఐవో) అధికారి డాక్టర్ సాజిద తెలిపారు. రెండు రోజులపాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 0 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 153 మంది పిల్లలు వివరాలను నమోదు చేసుకున్నట్లు, వారికి పరీక్షలు నిర్వహించి 23మందికి చికిత్స అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో 16 మందికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమున్నట్లు, 14మందికి రివ్యూ నిర్వహించనున్నట్లు డీఐవో తెలిపారు.



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సైనిక్ స్కూల్ పిలుస్తోంది

- 2026-27కు ఎంపిక
- ఈనెల 30లోపు దరఖాస్తులకు అవకాశం



చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగాల్లో పని చేయాలనుకునే వారిని సిద్ధం చేసేందుకు భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో సైనిక్‌స్కూల్స్ నడుస్తున్నాయి. ఇవి పిల్లల ఉజ్వల భవిష్యత్‌తో పాటు దేశ సేవ చేసే అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక స్కూల్స్ దేశంలోని 33 సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులను ఆహ్వానిస్తుంది. సైనిక స్కూల్స్ సొసైటీ ఆలిండియా సైనిక స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ ఈఈ) ఆధ్వర్యంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. రాత పరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ ఫిజికల్ వెరిఫికేషన్ మెరిట్ లిస్టు ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అక్టోబర్ 30లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరంలోని కోరుకొండ, చిత్తూరులోని కలికిరిలో సైనిక్‌స్కూల్స్ ఉన్నాయి.

పరీక్ష వివరాలు

- 6వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 01-04-2014, 31-03-2016 మధ్యలో జన్మించి ఉండాలి. 9వ తరగతి పరీక్షకు 01-04-2011 నుంచి 31-03-2013 మధ్య జన్మించి ఉండాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీ అక్టోబర్ 30. దరఖాస్తులను సరిదిద్దే అవకాశం నవంబర్ 2 నుంచి 4 వరకు అవకాశం కల్పించారు. జనవరిలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష మొత్తం ఓఎంఆర్ పద్ధతిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 125 ఉంటాయి. 6వ తరగతిలో 300 మార్కుల పేపరు ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 400 మార్కుల పేపర్ ఉంటుంది.
- విద్యార్థులు ఒకేసారి మాత్రమే దరఖాస్తు చేయాలి. దరఖాస్తు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదు.
- దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్// ఎగ్జామ్స్.ఎన్‌టీఏ.ఎన్ఐసీ.ఇన్/సైనిక్ స్కూల్స్ సొసైటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సైనిక్ స్కూల్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



- ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు 700 రూపాయలు, జనరల్, ఓబీసీ, డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు 850 రూపాయలు.
- ప్రవేశ పరీక్ష 13 ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రవేశ పరీక్ష జనవరిలో జరుగనుండగా, పరీక్ష తర్వాత నాలుగు నుంచి ఆరు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తారు.
- తాజా సమాచారం కోసం విద్యార్థుల తల్లితదండ్రులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ను తరచు గమనించాలి.
- ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే విద్యార్థులు ఎన్‌టీఏ హెల్ప్ డెస్క్ నంబర్ 011-040759000 లేదా ఏఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్‌కు మెయిల్ ద్వారా సంప్రదించాలి.

అర్బన్ ఎన్నికల్లో 59 నామినేషన్లు ఓకే

- 14 తిరస్కరణ
- నేడు ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు

కరీంనగర్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు 12డైరెక్టర్ పదవులకు 73మంది నామినేషన్లు వేయగా వాటిని పరిశీలించిన అధికారులు 14 తిరస్కరించారు. 59నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్. మనోజ్‌కుమార్ ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఒకస్థానానికి 9మంది, మహిళా కేటగిరీలో ఏడుగురు, జనరల్ కేటగిరీలో 43 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఆ తర్వాత తుది జాబితాను విడుదల చేయడంతోపాటు పోటీలోఉన్న అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించనున్నారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరగడంతో శుక్రవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెద్దింటికి జీవన సాఫల్య పురస్కారం



పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సినీ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాహితీవేత్త అమృతలత ఏటా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన సాహితీవేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు, అపురూప పురస్కారాలను అందిస్తున్నారు. జీవన సాఫల్య పురస్కారం-2025 సంవత్సరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సినీరచయిత పెద్దింటి అశోక్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. నవంబరు 2న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జీవన సాఫల్య పురస్కారం గ్రహీతలకు రూ.25 వేలు నగదు, ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేసి సన్మానిస్తారు. రాజన్నసిరిసిల్లజిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవనసాఫల్య పురస్కారం రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న ఖజానాకు రూ.2.19కోట్ల ఆదాయం

- బంగారం 124.50 గ్రాములు, వెండి 10.5 కిలోలు



ఆలయ హుండీల డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,19,35,165నగదు, 124గ్రాముల 500 మిల్లీల మిశ్రమ బంగారం, 10కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి వారి గత36రోజుల హుండీలను ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. ఈవో రమాదేవి పర్యవేక్షించగా ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఉద్యోగులు శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కాల్ చేయండి.. సమస్యను పరిష్కరించుకోండి

- విద్యుత్ సమస్యలకు 1912తో చెక్
- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు



మేక రమేష్‌బాబు, టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మీ పరిధిలో కరెంట్ పోయిందా? మీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందా? అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదా? పొలాల్లో వదులు తీగలున్నా అధికారులు సరిచేయ డంలేదా? ఇలా సమస్య ఏదైనా సరే 1912కు కాల్‌చేస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు. 1912 నంబరుకు కాల్ చేస్తే మీటరు నంబరు, ఊరు, పేరు నమోదు చేసుకొని ఒక ఐడీ నంబరు ఇస్తారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కాల్‌సెంటర్ సిబ్బంది మీమొబైల్‌లో అందుబాటులో ఉంటారు. ఒకవేళ సమస్యపరిష్కారం కాకపోతే దానికి గల కారణాన్ని వివరిస్తారు.

యాప్ ద్వారా సైతం ఫిర్యాదు

టీజీ ఎన్‌పీడీసీఎల్ సాంకేతికత పెంచడంతో పాటు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశ ముండగా నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులువుగా గుర్తు ఉండేలా 1912 నంబరును ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద ముద్రిస్తున్నారు. ఫిర్యాదు చేయగానే మొబైల్‌కు ఫిర్యాదు నంబరు వస్తుంది. ఆ నంబరు ఆధారంగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతారు. పరిష్కారం ఆలస్యమైతే ఫోన్ చేసి పరిష్కారం ఏ దశలో ఉందో చెబుతారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురివద్ద గోదావరి హారతి మూడోరోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభంనుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరంఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పూజలు జరిపారు. రాత్రి నదీమాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మన్ జక్కురవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని కేహెచ్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో అండర్-14 విభాగంలో కరీంనగర్ జిల్లా, అండర్-17 విభాగంలో పెద్దపల్లి జిల్లా జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించాయి. జట్లకు రాఘవేంద్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి ట్రోఫీలను పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, కేహెచ్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్, సీహెచ్ శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

- యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమురయ్య యాదవ్



ఖాదర్‌గూడెంలో జరిగిన యాదవ రాజకీయ శిక్షణలో అభివాదం చేస్తున్న యాదవులు

మానకొండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయంగా ఎదగాలని యాదవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొగాని కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో ఉమ్మడిజిల్లా యాదవ రాజకీయ శిక్షణ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపడి రాజకీయంగా పేద ప్రజలకు సేవ చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యాదవులను సంఘటిత పరిచి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా వారిని అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా యాదవులు మేల్కొని రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ, బల్కం మల్లేశ్ యాదవ్, రాజేందర్ యాదవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బూన అంజన్న యాదవ్, రవీందర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, కనబోయిన ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన పల్లె ప్రకృతివనం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాలపై అధికారుల పట్టింపు కరువైంది. గ్రామాల్లోని ప్రకృతివనాలు దట్టమైన చెట్లు, పిచ్చిమొక్కలతో కళాహీనంగా మారాయి. ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మల్యాల బ్లాక్‌చౌరస్తా సమీపంలో గల ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగామారింది. క్రీడాపరికరాలు పిచ్చిమొక్కలలో కనిపించకుండా అధ్వానంగా మారింది.



మల్యాలలో అధ్వానంగా మారిన ప్రకృతివనం

దిగువ కొండగట్టులో వెలగని హైమాస్టు లైట్లు

- చీకట్లో ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టులో హైమాస్టు లైట్లు వెలగడం లేదు. పది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దీంతో అంజన్న దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తీవ్రఅసౌకర్యంగా మారుతోంది. బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు, తదితర వాహనాల్లో వేలాదిగా భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లడానికి దిగువకొండగట్టులోని స్టేజీనుంచి వెలుతుంటారు. అయితే చీకటిపడగానే ఈమార్గం కనిపించకపోవడంతో వాహనదారులు, నడిచివెళ్లే వారు అయోమయానికి గురి అవుతున్నారు. అలాగే స్వామివారి దర్శనం చేసుకొని కొండదిగి వచ్చే భక్తులు దిగువ కొండగట్టులో ఆటవస్తువులు, తీర్థయాత్ర సామగ్రి కొనుక్కోవడం పరిపాటి. కాగా లైట్లు లేక అసౌకర్యానికి గురి అవుతున్నారు. దిగువ కొండగట్టులో నివసించే జనాలు కూడా లైట్లు వెలుగకపోవడంతో చీకట్లతో ఆందోళన చెందుతున్నారు. హైమాస్టు లైట్లకు మరమ్మతులు చేయాలని, కొండ పైవరకు పూర్తి స్థాయిలో లైట్ల వెలుతురు ఉండేలా దేవస్థానం అధికారులు తగుచర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



హైమాస్టు లైట్లు వెలగక చీకటిమయంగా ఉన్న దిగువ కొండగట్టు ప్రాంతం

మహిళలకు వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో 18నుంచి 45సంవత్సరాలలోపు మహిళలకు స్వయం ఉపాధికై వివిధ కోర్సులకు ఉచిత శిక్షణను నవంబర్ 10నుంచి ప్రారంభించనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్ర జిల్లా మేనేజరు సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా అందించే కోర్సులు టైలరింగ్, జూట్‌బ్యాగ్ తయారీ, ఈ-ఆటో డ్రైవింగ్, ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ వంటి కోర్సులలో శిక్షణ పొందేందుకు 25మంది మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ, ఉచితహాస్టల్ వసతిఅవకాశం కల్పించనున్నారు. ఆసక్తిగల మహిళలు తమ 7నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలను, ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్ 7లోపు ఎల్ఎండీ కాలనీలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మహిళాప్రాంగణ మేనేజర్ తెలిపారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు



రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర ఆలయాలు శుక్రవారం భక్తజనసంద్రంగా మారాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలను ఏర్పాటు చేయడంతో భక్తులు భీమన్న దర్శనానికి పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. రాజన్నను దర్శించుకుని ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భీమన్న ఆలయానికి చేరుకున్నారు. దీంతో రాజన్న ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ అందించే సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6లోగా దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. మైనారిటీ నిరుద్యోగ యువతీయువకులకు స్వల్పకాలిక, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకు రావాలని తెలిపారు. ప్రొఫెషనల్ ఐటీ రంగాల్లో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుబంధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల శిక్షణా సంస్థలు ప్రతిపాదనలను జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

సుల్తానాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శనివారం సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో పోలీసులతోపాటు యువత పాల్గొని విజయవంతం చేయాలని సీఐ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సీఐ మాట్లాడుతూ సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ ఆదేశాల మేరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలపల్లి, ఎలిగేడు, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ ప్రాంతం వారు పాల్గొనాలని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పాత్ర ప్రదర్శన పోటీల్లో గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి విద్యార్థినులు శ్రావ్య, సహస్ర, కార్తీక, ప్రణతి, హర్షిత విజేతలుగా నిలిచారు. శుక్రవారం డీఈవో మాధవి వారిని అభినందించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థినులను గైడ్ టీచర్లు మురళీధర్, కృష్ణకుమారిని ప్రిన్సిపాల్ గోల్డిబల్బీర్ కౌర్ అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్తా చాటిన విద్యార్థులు



మెడల్స్ సాధించిన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం అండర్-14 బాలికల విభాగంలో వర్షిత గోల్డ్, అభిజ్ఞశ్రీ, సంప్రీత్ బ్రాంజ్ మెడల్‌లు సాధించారు. బాలుర అండర్-17 విభాగంలో సుశాంత్ గోల్డ్, ఖుషి సిల్వర్, మణికంఠ, అష్రఫ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, కృష్ణప్రియ అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, సతీష్, మమత పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో సప్తాహ ప్రవచనం

సుల్తానాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ శివాలయంలో కార్తీక మాస సప్తహ ప్రవచనం, పౌర్ణమి రోజు దీపోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ధర్మాచార్యులు మెంగని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ప్రజల్లో భక్తి భావం పెంచడానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 30 నుంచి నవంబరు 5 వరకు రోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పౌర్ణమి రోజున దీపోత్సవం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నేడు నాగుల చవితి

మంథనిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లిలోని సంతాన నాగేంద్రస్వామి ఆలయంలో శనివారం నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు శశికళ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మంథనిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విలోచవరంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి మంజురైన నిధులతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు మంథని సత్యం, కోరవేన రవి, రోడ్డ రాజేశ్వరరావు పాల్గొనారు.

క్రీడాకారిణికి సన్మానం

కమాన్‌పూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనందిని శుక్రవారం సన్మానించారు. ఈ నెల 22న ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్ ఇండియా అండర్ 16 విభాగంలో 600 మీటర్ల పరుగులో గోల్డ్ మెడల్ సాధించింది. కోచ్ సుబ్బారావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు. మంజూర్, గౌతమ్, శంకరయ్య, రఫీక్, డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

కర్నూలు బస్సు ప్రమాద ఘటన బాధాకరం

సుల్తానాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురై పలువురు మృతి చెందడం బాధాకరమని సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్, సౌత్ ఇండియా చైర్మన్ జూపల్లి తిరుమల్‌రావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని బస్సులు, బాధ్యతలేని డ్రైవర్లు ఉన్నంత వరకు ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయన్నారు. ట్రావెల్స్ వాహనాలపై అధికారులు నిఘా ఉంచాలన్నారు.

సౌభాగ్య పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో సౌభాగ్య డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీఎం వై బ్రహ్మానందరావు పిలుపునిచ్చారు. శుక్రవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సౌభాగ్య డిపాజిట్ పథకంపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. వ్యాపార అభివృద్ధి, ఉన్నత విద్య, వాహనాల రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను అందిస్తున్నామన్నారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, మేనేజర్లు సుమాంజలి, సరోజన, ఉదయశ్రీ, ఎఫ్ఎల్‌సీ మోహన్‌రావు, వాకర్స్ పాల్గొన్నారు.

వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు సన్మానం

సుల్తానాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 304కు గవర్నర్‌గా ఎన్నికై శుక్రవారం సుల్తానాబాద్‌కు వచ్చిన అన్నమనేని సుధాకర్‌రావు, రమణారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, రవీందర్‌లను జూనియర్ కళాశాల మైదానంలో సన్మానించారు. అయిల రమేష్, శ్రీనివాస్ గౌడ్, వేణు, రాజలింగం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్గాం మద్యం షాపునకు 45 దరఖాస్తులు

● రామగుండం రెండు షాపులకు దరఖాస్తు చేసిన హైదరాబాద్ వ్యాపారులు

కోల్‌సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల్లో రామగుండం ఎక్సైజ్ పరిధిలోని అంతర్గాం మద్యం దుకాణానికే జిల్లాలోనే అత్యధికంగా 45దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఈ షాపునకు 56దరఖాస్తులు రాగా ఈ సారి 45 వచ్చాయి. కేవలం దరఖాస్తులతోనే ప్రభుత్వానికి ఈ ఒక్క షాపు ద్వారా రూ.1.35కోట్ల ఆదాయం సమకూరింది. వార్షిక లైసెన్స్ ఫీజు రూ.65లక్షలు అయితే రెండేళ్ల రెంటల్ రూ.1.3కోట్లు ఉండగా దరఖాస్తులతోనే రూ.1.35కోట్ల ఆదాయం సమకూరింది. రామగుండం ఎక్సైజ్ పరిధిలో 24మద్యం దుకాణాలకు 474దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎక్సైజ్‌శాఖకు రూ.14.22కోట్ల ఆదాయం సమకూరింది. గతంలో 539 దరఖాస్తులు రాగా 10.78కోట్ల ఆదాయం వచ్చింది. ఈ సారి 65దరఖాస్తులు తక్కువ వచ్చినా దరఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచడంతో రూ.3.44కోట్లు ఆదాయం సమకూరింది. రామగుండం ఎక్సైజ్ పరిధిలో గౌడ, ఎస్‌సీలకు కేటాయించిన నాలుగు షాపులకు తక్కువ దరఖాస్తులు వచ్చాయి. గౌడ కులస్తులకు కేటాయించిన 47, 57షాపులకు హైదరాబాద్ నుంచి ఇద్దరు వ్యాపారులు రెండు దరఖాస్తు ఇచ్చారు. రామగుండం ఎక్సైజ్ పరిధిలోని అంతర్గాం షాపుతోపాటు రామగుండం పట్టణం, ఎన్‌టీపీసీ, రాజేష్ థియేటర్ సమీపంలోని మద్యం దుకాణాల్లో అత్యధిక అమ్మకాలు జరుగడంతో వాటికి దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్టు తెలుస్తున్నది. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 27న పెద్దపల్లి సమీపంలోని బద్దంపల్లి స్వరూప గార్డెన్‌లో జరిగే లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరు కావాలని, ఉదయం 9గంటలకు దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మంగమ్మ తెలిపారు.

జాగృతి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

● వివిధ విభాగాల్లో జిల్లాలోని పలువురికి చోటు

పెద్దపల్లి, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా కోదాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో సాంస్కృతిక, సామాజిక అంశాలపై పని చేస్తున్న తెలంగాణ జాగృతి సంస్థ బలోపేతంలో భాగంగా ఈ నియామకం జరిగింది. శ్రీనివాసరావు నియామకంపై ఆయన అభిమానులు, జాగృతి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. జాగృతి లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తానని శ్రీనివాస్ రావు అన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): ముప్పిరితోట గ్రామానికి చెందిన కోదాటి శ్రీనివాస్‌రావును జాగృతి జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి రాష్ట్ర కమిటీలో గోదావరిఖనికి చెందిన జాగృతి సీనియర్ నాయకులకు చోటు దక్కింది. సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అందె సదానందం, సోషల్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నిట్టూరి రాజు నియమితులయ్యారు. అందె సదానందం గతంలో జాగృతి రామగుండం నియోజకవర్గ కన్వీనర్‌గా, ప్రస్తుతం జిల్లా అధికారప్రతినిధిగా కొనసాగుతున్నారు. నిట్టూరి రాజు విద్యార్థి విభాగంలో పనిచేశారు.



కవితతో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అందె సదానందం

సిమ్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన నరేందర్



కళ్యాణ్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(సిమ్స్) ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నరేందర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రిన్సిపాల్ హిమబిందుపై ప్రభుత్వం వేటు వేయగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నరేందర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. మెడికల్ కళాశాల సిబ్బంది, ప్రొఫెసర్లు ఆయనను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న నరేందర్‌ను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.

ట్వినింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమం

ముత్తారం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను పారుపల్లి పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా సందర్శించగా సైన్స్ ల్యాబ్‌లోని బయాలజీ, ఫిజికల్ సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఎల్ఈడీ ప్యానల్స్ ద్వారా టీ ఫైబర్ ద్వారా విద్యాబోధనపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు ఓదెలు, వేగోలపు సదానందం, అంజయ్య, మహిపాల్, సతీష్ ఉన్నారు.

అనారోగ్యంతో బిల్ కలెక్టర్ మృతి

కోల్‌సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న సుదర్శన్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. చికిత్స నిమిత్తం అతన్ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని మృతిపై కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి సంతాపం వ్యక్తం చేశారు.

ధాన్యం తూకం తర్వాత నిర్వాహకులదే బాధ్యత



హరిపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం పూర్తయిన తర్వాత కేంద్రాల నిర్వాహకులదే బాధ్యత ఉంటుందని, రైతులకు సంబంధం ఉండదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. శుక్రవారం గుండ్లపల్లి, కనగర్తి, పిట్టల ఎల్లయ్యపల్లి, హరిపురంలో వ్యవసాయ సహకార సంఘం, ఐకేపి ఆధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి బోనస్ డబ్బులు చెల్లిస్తున్నామని, రైతులు అధైర్యపడవద్దని తెలిపారు. తూకం పూర్తి కాగానే రైతులకు ట్రక్ షీట్ అందజేయాలన్నారు. నెల్లూరి సాంబ రకం ధాన్యంలో ఔటింగ్ రావడం లేదని, ఇదే రకం ధాన్యం మిల్లులకు రెండు లారీల చొప్పున మాత్రమే దిగుమతి ఉంటుందన్నారు. ధాన్యాన్ని శుద్ధి చేసి తేమ శాతం తగ్గిన తర్వాత తీసుకురావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమసాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, పుప్పాల శంకర్, సీఈవో అంజిరెడ్డి, కొట్టే దేవేందర్, విజయపాల్ రెడ్డి, గుండేటి ఐలయ్య, అలాగే విజయేందర్ రెడ్డి, చొప్పరి రాజయ్య, తాళ్లపల్లి శ్రీనివాస్, కందుల సదాశివ పాల్గొన్నారు.

గోరక్షకుడిపై జరిగిన దాడికి నిరసన

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా పోచారం పోలీస్‌స్టేషన్ సమీపంలో గోరక్షకుడు సోను (ప్రశాంత్)పై జరిగిన దాడికి నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. జిల్లా ప్రధానా కార్యదర్శి పల్లె సదానందం మాట్లాడుతూ ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ దేవాలయాల పైన, గోరక్షకుల పైన ఆగడాలు ఎక్కువ య్యాయన్నారు. అమరగాని ప్రదీప్, నిర్మల, మహేందర్ యాదవ్, శివంగారి సతీష్, అక్కనపల్లి క్రాంతి, పర్శ సమయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ శ్రేణులు

అమృత మిత్రలో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం

కోల్‌సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 కింద నగరపాలక సంస్థకు రూ.65లక్షల నిధులను మంజూరు చేసిందని, ఈ నిధులతో చేపట్టనున్న పనుల్లో స్వశక్తి మహిళలు భాగస్వామ్యం కల్పించనున్నట్టు కమిషనర్ జే అరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం కార్యాలయంలో మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నీటి సరఫరా నిర్వహణ, నాణ్యత పరీక్ష, లీకేజీల మరమ్మతు తదితర పనుల్లో స్వశక్తి మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారిని గుర్తించాలని మెప్మా సిబ్బందికి సూచించారు. సాంకేతిక నైపుణ్యం అవసరం ఉన్న పనులు చేపట్టడానికి వీలుగా న్యాక్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ ఇప్పించనున్నట్టు తెలిపారు. అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, ఎస్ఈ గురువీర, ఈఈ వీవీ రామన్, సెక్రటరీ ఉమా మహేశ్వర్‌రావు, టీఎంసీ మౌనిక, సీఓలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పిస్తాం

ధర్మారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారలకు అవసరమైన వసతులు కల్పిస్తామని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ అన్నారు. ధర్మారం-ఎలిగేడు మండలాల బ్లాక్‌స్థాయి క్రీడలను శుక్రవారం ప్రారంభించారు. క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి ఉపయోగపడుతాయన్నారు. నందిమేడారంలో ప్రారంభమైన పోటీల్లో బాలురకు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, చెస్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు, ప్రిన్సిపాల్ విద్యాసాగర్, డాక్టర్ అనుదీప్, సుమన్, సతీష్, జుర్రు సతీష్, మహేశ్ పాల్గొన్నారు.

గుబులు పుట్టిస్తున్న మబ్బులు

(5వ పేజీ తరువాయి)

చెల్లించడం లేదు. పొడవు పింజ గల పత్తి క్వింటాలుకు రూ.8,110, మధ్య రకం పింజ గల పత్తికి 7,710 రూపాయల మద్దతు ధర చెల్లించాల్సి ఉంటుంది. కానీ తేమ శాతం అధికంగా ఉండడంతో రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. శుక్రవారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 986 బస్తాల్లో 1010.90 క్వింటాళ్ల పత్తిని 349 మంది రైతులు తీసుక వచ్చారు. గరిష్ఠంగా క్వింటాలుకు 7,011 రూపాయలు, కనిష్ఠంగా 5,210, మోడల్ ధర 6,750 రూపాయలు పెట్టారు. ఏ ఒక్క రైతుకు కూడా మద్దతు ధర దక్కకపోవడం గమనార్హం. ఏరిన పత్తిని నిల్వ చేసేందుకు సరిపడా స్థలాలు లేక రైతులు మద్దతు ధర దక్కకున్నా విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ నిల్వ చేస్తే తేమ ఎక్కువై పత్తి నల్లబడి పోయి అసలుకే మోసం వాటిల్లవచ్చనే భయంతో రైతులు మద్దతు ధరలు దక్కకున్నా కూడా పత్తిని విక్రయిస్తున్నారు. ధాన్యాన్ని కూడా రైతులు తేమ శాతం అధికంగా ఉండడంతో రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నారు. పంట చేతికి వచ్చే వరకు వర్షాలు పడవద్దని రైతులు వరుణ దేవుడిని కోరుకుంటున్నారు.

కురిసిన వర్షం

మంథని, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా మంథనిలో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురిసింది. సాయంత్రం నుంచే ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకొని రాత్రి సమయంలో దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది. పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గింది. అకాల వర్షంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని శుక్రవారం సాయంత్రం నల్లటి మబ్బులు కమ్మేశాయి. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. చిరుజల్లులు పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్ పరిధిలో 11కేవీ ఫీడర్ మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పైవింక్లయిన్, 7బీకాలనీ, విఠల్‌నగర్, పరుశరాంనగర్, భగత్‌సింగ్‌నగర్, తిలక్‌నగర్, సిక్ హాస్పిటల్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో వెస్ట్ సెక్షన్ ఏరియా ఏఈ కే నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వరిలో చీడపీడల నివారణపై

రైతులకు అవగాహన

పాలకుర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కన్నాలలో వరిలో చీడపీడలపై శుక్రవారం మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పత్తి రైతులు విధిగా కపాస్ కిసాన్ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కంకినల్లి పురుగు గింజలను తిని నాణ్యత లేకుండా చేయడం, తాలు గింజలుగా మారేలా చేయడంతో నష్టాలను కలిగిస్తుందన్నారు. నివారణకు స్పైరోమెసిఫెన్ 240 ఎస్.సి (22.9%)ప్రొపర్గైట్ లేదా ఓమైట్, ఫైసైర్ ఆక్సిమెట్ వంటి మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. రైతులు లక్ష్మయ్య, సత్తయ్య, చందు, అరుణ్‌కుమార్ ఉన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): హరిపురంలో చిరుసంచుల వరి క్షేత్రాలను రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన కేంద్రాల్లో అభివృద్ధి చేసిన నాణ్యమైన వరి విత్తనాలను గ్రామానికి ముగ్గురు అభ్యుదయ రైతులకు అందించామన్నారు. శాస్త్రవేత్త పిల్లి కిరణ్ మాట్లాడుతూ ఈసారి వరి పంటలకు తెగుళ్ల వ్యాప్తి చెందాయని, పొట్టదశకు చేరుకుని గొలుసులు బయటకు వచ్చాక గింజ గట్టిపడకుండా తాలుపోసి తెల్లగా నిలబడిపోతుందన్నారు. ఆకులు ఎర్రబారుతున్నాయని, ఈ సమస్య వివిధ చీడపీడల ద్వారా ఏర్పడుతుందన్నారు. రైతులకు పలు సూచనలతోపాటు వరిలో చీడపీడల పట్ల అవగాహన కల్పించారు. వేల్పుల సంపత్ రావు, మహేందర్ ఉన్నారు.

పామాయిల్ సాగు చేయాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు పామాయిల్ పంటను సాగు చేసేందుకు ముందుకు రావాలని మండల ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి బోడుకల రాము అన్నారు. శుక్రవారం సబ్బితం, గట్టు సింగారంలో సాగు చేస్తున్న నిమ్మ, జామ, సీతాఫల్, అల్లనేరేడు, పామాయిల్ తోటలను ఉద్యానవన శాఖ విస్తరణ అధికారి రాము పరిశీలించారు. గట్టు సింగారం శివారులో దుర్గం పూడి రవిందర్ రెడ్డి సాగు చేస్తున్న తోటలను పరిశీలించి పామాయిల్ సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. పామాయిల్ సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ఒక ఫొటోతో ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. రైతులు కమలాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, శంకర్, మహేస్, తిరుమల, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, రైతులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలను సందర్శించిన జీఎం (కార్పొరేట్)

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని సింగరేణి హైస్కూల్ సెక్టార్-2 పాఠశాలను శుక్రవారం సింగరేణి ఎడ్యుకేషనల్ జీఎం(కార్పొరేట్) వెంకటచారి సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల స్థితిగతులను, సౌకర్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల అడ్మిషన్లు, ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. వెంకటచారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పదో తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని, అందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి లక్ష్య సాధనకోసం అహర్నిశలు కష్టపడాలని సూచించారు. వెంకటచారిని పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు సన్మానించారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం ఎడ్యుకేషన్(కార్పొరేట్) వెంకటచారి

ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట



రెస్ట్‌హాల్‌ను ప్రారంభిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య తెలిపారు. శుక్రవారం ఏరియాలో నిర్మించిన రెస్ట్, మల్టీపర్పస్ హాల్‌లను ఆయన ప్రారంభించారు. జీఎం ఆఫీస్ మహిళా ఉద్యోగినుల సౌకర్యార్థం క్రెచ్, రెస్ట్‌హాల్‌ను ప్రారంభించారు. జీఎం ఆఫీస్ సిబ్బంది వాహనాల పార్కింగ్ షెడ్డును, గాంధీనగర్, సివిల్ డిపార్ట్‌మెంట్‌లలో మల్టీపర్పస్ హాల్‌లను జీఎం ప్రారంభించారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, ఎస్వోటూ జీఎం రాముడు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సివిల్ డీజీఎం ధనుంజయ, అధికారులు సృజన్‌మెహ్రా, సంతోష్‌కుమార్, రామచంద్ర, అశ్విని పాల్గొన్నారు.

ఓబీ ఉద్యోగులకు వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ఓబీ పనులు నిర్వహిస్తున్న కంపెనీలకు చెందిన ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించింది. ఎస్వోటూ జీఎం రాముడు, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ రవీందర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారులు సంతోష్‌కుమార్, ఉదయ్ హరిజన్, డా.మహిపాల్, లక్ష్మణరావు, అజీజ్ పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో ధ్యానం, యోగా తరగతులు

గోదావరిఖని, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో బ్రహ్మ కుమారీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులకు ధ్యానం, యోగా తరగతులు నిర్వహించారు. బ్రహ్మ కుమారి అంజలి బెహెన్ మాట్లాడుతూ ప్రతి మనిషికి ఆశలకి అంతు ఉండదు, ఉన్న వాటితో తృప్తి ఉండదు లేని వాటి కోసం ఆలోచిస్తారన్నారు. జీవితమంటేనే ఇలాగే ఉంటుందని ఉన్నదానితో తృప్తి చెందాలన్నారు. రోజుకు గంట సమయం యోగాకు కేటాయిస్తే ఎలాంటి జబ్బులు దరిచేరవన్నారు. ప్రపంచ వ్యాప్తంగా యోగా బహుళ ప్రాచుర్యం పొంది ఆరోగ్య ప్రదాయినిగా నిలుస్తున్నదని తెలిపారు. జీఎం డి.లలిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం చంద్రశేఖర్, ఓసీ-5 ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మిబాయి, ఆడిట్ మేనేజర్ మోహన్‌రావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, బ్రహ్మకుమారీస్ పద్మ, కీర్తి సేవా సెక్రటరీ రజిత, జాయింట్ సెక్రటరీ బీనాసింగ్, జీఎం కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించడంలో సంఘాలు విఫలం

గోదావరిఖని, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని టీబీజీకేఎస్ కేంద్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య అన్నారు. శుక్రవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జీడీకే11ఇంక్లైన్‌పై కార్మికులను కలిసి సమస్యలను తెలుసుకొన్నారు. కొమురయ్య మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు కార్మికులకు ద్రోహం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆరు గ్యారంటీలను ప్రకటించిన ఐఎన్‌టీయూసీ, 42 హామీలు ఇచ్చిన ఏఐటీయూసీలు ఆచరణలో వాటి ఊసెత్తడం లేదన్నారు. డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏడు నెలలుగా మెడికల్ బోర్డ్ నిర్వహించకుండా జాప్యం చేస్తుంటే సంఘాలు స్పందించడం లేదన్నారు. పిట్ కార్యదర్శి వాసర్ల జోసెఫ్, కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, ఆర్జీ-1 ఉపాధ్యక్షులు వడ్డెపల్లి శంకర్, కేంద్ర నాయకులు పోలాడి శ్రీనివాస్‌రావు, మోదుంపల్లి రాజేశం, అంబటి శ్రీనివాస్, ఆకారపు వంశీ, తోట రాజేష్, కోటి లింగం, చంద్ర కాంత్, భారత్, సారయ్య నాయక్, అడ్డగట్ల గోపి, నూతి రాజకుమార్, రహమాన్, పులిపాక శంకర్, అప్సర్ పాషా పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకులు